# పులుపు చావని చింత

అద్దం ముందు నుంచుని ఆరాట పడుతున్నాడు. మొహం చిట్లించుకుంటూ విసుక్కుంటున్నాడు. తాను కోరుకున్న రూపం అద్దంలో కనపడటంలా, కనుబొమ్మలు పైకి కిందికు తిప్పుతూ, మెడ కుడి వైపుకు కొంచెం వంచి 'ఆ' అనుకుంటున్న సమయంలో అద్దంలో భార్యను చూచి ఉలిక్కి పడ్డాడు.

'నన్ను చూచి అంత భయపడ్డారేమిటి.... "పక పక నవ్వేసింది శారద.

చేతిలో దువ్వెనను విసురున గిరాటు పెట్టేశాడు చిరాకుగా తన వెనకాలే నిలబడ్డ భార్య వాలకాన్ని, ఓరచూపుతో తిలకిస్తున్నాడు. ఆనందరావు దృష్టి కోణం అప్రయత్నంగా అమాంతం ఒక టొచ్చి శారద కంట్లో గుచ్చుకుంది. ఆమె చివాలున, యింకొక అడుగు ముందుకు వేసి, భర్త మొహంలోకి చూస్తూ కొంటెగా నవ్వింది. అతనికి అహం బాగా దెబ్బ తిన్నది. 'ఊఁఊఁ" అంటూ బుసలు కొడుతున్నాడు. క్షణకాలం తీవ్రంగా చూశాడు. చప్పున,

పై పళ్ళతో క్రింది పెదిమను గట్టిగా నొక్కుతూ కుడిచేతి చూపుడు వేలును, పాపిడి లోనికి పోనిచ్చి, బొటన వేలు సహాయంతో, ఓ పొడుగాటి తెల్లటి వెంట్రుకను కుదుళ్ళ కదిలేటట్లు పైకి లాగేశాడు. దాన్ని అద్దంలో పూగిస్తూ తలపూపాడు, విజయ గర్వంతో శారదకు నవ్వాగ లేదు.

'ఎందుకూ అంత నవ్వు' అంటూ భార్య వైపుకు తిరుగుదామనుకుని, వెంటనే ఆగిపోయి, ధీమాగా నిలబడి, యింకెక్కడయినా, నీక్కనిపిస్తే చెప్పు అన్నాడు కసిగా.

తెల్ల జుట్టే అనుకున్నా, దృష్టిలోపం కూడా వచ్చిందన్న మాట.... విరగ బడి నవ్వింది శారద.

'ఇంకెక్కడున్నాయేంటి' అని మనస్సులో అనుకుంటూ జుట్టంతా .పీక్కున్నాడు. వెండి తీగలు' అక్కడక్కడ బాగానే కనిపించినాయి. అక్కసు పట్ట లేక పోయాడు. అటూ యిటూ మెడ విసురుగా తిప్పి, గభాలున బ్రిల్ క్రీమ్ యింత చేతిలో వేసుకుని, తలంతా మర్దన చేసుకున్నాడు. తమాయించుకుని, నాజూకుగా జుట్టును అదుపులోకి తీసుకొచ్చాడు. మెత్తగా నల్లగా జుట్టు ఒదిగి ఒదిగి పడుకుని వుంది. తలను ఊగిస్తూ, అద్దంలో చూసుకుంటూ అమ్మయ్య అని సంతృప్తిగా నవ్వుకున్నాడు.

శారద, ఆట్టే భర్త చేష్టలన్నీ చూస్తూ, అట్లాగే నిలబడి పోయింది.

'ఇంతకీ, మిమ్మల్ని నవ మన్మథులని జనం అనుకుంటున్నారని మురిసి పోతున్నారన్నమాట. అంతేగా....'

నువ్వూహిస్తున్నట్లు, ముసలి వాడని మాత్రం అనుకోవడం లేదు, తెలిసిందా... 'విశ్వాసంతో భార్య మొహంలోకి చూశాడు.

ఇంతలోకే 'తాతయ్యా...'అంటూ నన్హటి గొంతుక ఆనంద రావుకు వినిపించి గతుక్కు మన్నాడు.

'వీడెవడు, తాతయ్యా అంటూ బయల్దేరాడు ఎన్ని సార్లు చెప్పినా బుద్ధిలేదు. బావ మామయ్యా, అన్నయ్యా బాబాయి, యిన్ని వరసలుంటే, వీటన్నింటిని వదిలి పెట్టేసి, తాతయ్యా అంటా డేమిటి, వీడి వరస మండిపోను' లోపల లోపల సణుక్కుంటూ, పళ్లు పట పట మనిపించాడు ఆనందరావు

ఏమిటి నన్ను సమాధానం చెప్పమంటారా మీ ప్రశ్నకు.... లేకపోతే అ పిలుపును మీరు విన లేదని నన్ను అనుకో మ టారా.... 'చిరు నవ్వుతో, శారద మొహం కళ కళ లాడింది.

వెధవ వరసలు, వాటికి అర్థం యేమిటి! ఆ లెక్క ప్రకార మయితే, నిన్నా మొన్నా పుట్టిన వాడు కూడా తాతయ్యే అవచ్చు కూడా... అయినా వాణ్ణసలు, నన్ను యెప్పుడు అట్లా పిలవద్దని చెప్పానే.... ఓహో యిప్పుడు తెలిసిందిలే. నువ్వు ఆడిన నాటక మన్న మాట....'

'ఇది మరీ బాగుంది. యిందాకటి నుంచి నే యిక్కడే వున్నాగా, నేనేం చేశానని మధ్య....

'ఈ మాత్రం నే కని పెట్ట లేనను కున్నావా....'

'అయితేనే, ముందరే వాడికి చెప్పి, మిమ్మల్ని తాతయ్యా అని పిలవమన్నానన్నమాట. అంతేగా మీ ఊహ.... ఒరేయ్ వాసూ యిట్రారా.... అడగండి 'శారదకు బాగా కోపం వచ్చింది.

'అమ్మమ్మా.... మా అమ్మే... 'అంటూ వాసు తడబడు తుంటే ఆనందరావు పెద్ద పెట్టున బిగ్గరగా నవ్వాడు.

'ఎందుకూ అంత విరగ బడటం అయ్యయ్యో... కొ_స్త అట్టే పెట్టుకోండి...'

'అమ్మమ్మే... నువ్వు నిజంగా అమ్మమ్మే... తిక్క కుదిరింది.... 'ఆనందరావుకు నవ్వాగటం లేదు

'అందుకా మీకు నవ్వొట... 'యిప్పుడు తెలిసింది. నిలువుగా తల వూపుతూ ధీమాగా భర్త వంక చూస్తూ 'ఒరేయ్ వాసూ, నేను అమ్మమ్మ నవుతే, యీయనగారు యేమవుతార్రా.... 'వాసును దగ్గరకు తీసుకుంది.

'తాతయ్యా'.... నాలికను రెండు సార్లు కదిలించాడు వాసు

గభాలున నవ్వేశాడు ఆనందరావు.

వాసు చెయ్యిపట్టుకుని, పకపక నవ్వుకుంటూ వెళ్ళిపోయింది.

ఆనందరావు కసి పట్ట లేక పోతున్నాడు. నన్ను ఉడికించటానికి శారద అట్లా చీటికి మాటికి అంటోందా లేక పోతే నిజంగానే ముసలి వాణ్ణయి పోయానా! ఛీ ఏం కాలేదు. సమాధాన పడి చప్పున ఆగి పోయాడు.

అవునూ యేళ్లొచ్చిన మాటవ్వుతే నిజమే, కాని యింకా ముసలి కళ పడ లేదు. జుట్టు నెరవటానికేమిటి యీ రోజుల్లో పదేళ్ళ కుర్రాడికి కూడా జుట్టు నెరుస్తోంది. దాంట్లో యేముంది మొహంలో ముడతలు యేంలేవు. బుగ్గలవుతే లొట్టపో లేదు. కళ్ళు కూడా అట్టే లోతుగా పోనట్టే. స్నో రాసిం తర్వాత మొహంలో

చాలా మార్పు వచ్చేసింది. పౌడరు కూడా లైట్‌గా అద్దితే, ఖచ్చితంగా యిరవై యేళ్ళు వెనక్కి నడిచినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. పెళ్ళి నాటి ఫొటో ప్రక్కన పెట్టుకుని చూస్తుంటే పెద్దగా ఆట్టే తేడా కనిపించటంలా. ఈ క్రాఫ్ కొంచెం పొడుగ్గా వుంటే బాగుండేది. ఈ వెధవ బట్టతల ముందుకే రావటం మూలాన షేప్ కొంచెం దెబ్బ తిన్న మాటవుతే వాస్తవమే. బట్టతల కూడా కనిపించకుండా చెయ్యొచ్చనుకో. అయినా అంత చేటు అనవసరం. ఎంతైనా నేను పాతికేళ్ళ కుర్రాడ్ని కాదుగా...' అద్దంలో అట్టే చూసుకుంటూ తనను తాను పరిచయం చేసుకుంటున్నాడు ఆనందరావు.

ఓక్షణంలో బాగా మనస్సుకు సంతృప్తి కలుగుతోంది. మరుక్షణంలో కసిగా అద్దాన్ని పగల కొట్టాలన్నట్లు, ఆందోళన పడుతున్నాడు.

నిబ్బరంగా అట్లాగే నిలబడి జుట్టును చేత్తో పదే పదే నిమురుతూ, కనురెప్పల్ని అడిస్తూ, ఎండి పోతున్న పెదిమలను తడి చేసుకుంటూ, 'నాలో ముసలి కళ మాత్రం రాలేదు.' అని నిశ్చయంగా అనుకున్నాడు ఆనందరావు

అ నిట్టూర్పు వాయువులు, పూర్తిగా సమసి పోక మునుపే 'వస్తా .. అంటూ గుమ్మం గడపలో దిగ బోతున్న వాసు నోరును అమాంతం చేత్తో నొక్కేసి, 'నువ్వేం చెప్పక్కర్లేదు గాని, అంటూ వాకిలి గేటు దాకా పంపించేసి చేతులు రెండూ దులుపు కుంటూ, లోపలికి వచ్చేశాడు ఆనందరావు.

'ఎట్లాగయితే' ఓపసి వాడి నోరు మూసేసి, మీరు విజయాన్ని సాధించారు... 'వంచిన తల యెత్తకుండా తాపీగా అన్నది శారద

నీకెన్ని సార్లు చెప్పినా కూడా అర్థంకాక పోతే నేనేం చేస్తాను నన్ను ఎగతాళి చెయ్యటంలోనే నీకు సరదా అయితే, నీ సరదా తీర్చటానికి యెప్పుడూ నేసిద్ధమే' నవ్వు తెప్పించు కోవటానికి విఫల ప్రయత్నం చేశాడు, ఆనందరావు

'నా సరదా అల్లా వున్న దాన్ని వున్నట్టుగా చూట్టం... లేంది ఊహించు కోక పోవటం అంతే...."నిక్కచ్చిగా అనేసింది.

ఆనందరావు యేమీ అనలేక పోయాడు. మెదలకుండా వూరు కున్నాడు. శారద కూడా ముభావంగానే వుండి పోయింది.

ఈయన కెందుకు యింత తాపత్రయం. ఈమధ్యలో ఆయన ఆలోచనల్లోనూ, ఊహల్లోనూ, యెంతో మార్పు కని పిస్తోంది. తీర్చుకోలేని కోర్కెల్ని పెంచుకుంటున్నారు. ఎందుకనో అర్థం కావటం లేదు తనలోతాను తీవ్రంగా మథన పడుతోంది. ఆయన వాలకం, ధోరణి చూస్తుంటే, శారద మనస్సు పరిపరి విధాలుగా ఆలోచిస్తోంది చప్పున త్రుళ్ళి పడ్డట్లయింది. ఏదో 'తళు క్కున మెరిసినట్లయింది. క్షణంలో మొహం విప్పారింది. సంతృప్తిగా నవ్వుకుంది.

ఆనాడు అఫీసు నుంచి వస్తూనే కసిగా, అమాంతం కుర్చీలో కూర్చుని కాలి బూటును విప్పేసి వరండాలోకి గిరాటు పెట్టాడు. పడకకుర్చీలో పడుకుని చేతులు రెండూ వెనక్కు పొడుగ్గా బారజాపి, బుసలు కొడుతున్నాడు. భర్త హడావిడి అంతా ఓకంట గమనిస్తూనే, యేమీ తెలియని దానిలాగ, వయ్యారంగావచ్చి, చిరునవ్వుతో పలకరిస్తూ, ఆనందరావుకు టీ కప్పును అందించింది శారద.

విప్పారిన మొహంతో భర్తవంక అదే పనిగా చూస్తూ 'మీరివ్వాళ యెట్లా వున్నారనుకున్నారు. నవ మన్మధుల్లాగ వున్నా రంటేనమ్మండి....' నిబ్బరంగా ఆశగాఅన్నది శారద.

ఆనందరావుకు వీపు తట్టినట్లయింది. 'ఆ'....అంటూ ఆశ్చ ర్యంగా, భార్య మొహంలోకి విడ్డూరంగాచూశాడు, పడుకున్న వాడల్లా, గభాలున లేచికూర్చుని.

మళ్ళీ క్షణంలో తలదించేసి, చప్పగా పడుకున్నాడు.

'ఇంత మాత్రంతో మోసపోన్లే, నన్ను ఉలికించటానికి యిది కూడా ఓ పద్ధతే...' అసహనాన్ని ప్రదర్శించాడు.

'నేను ఉన్నది ఉన్నట్టుగా చెపుతా. ఎగ్జాగిరేట్ చేసి చెప్పాలిసిన అవసరం యేమీ లేదు మీలో యివ్వాళ పూర్తిగా మార్పును చూస్తున్నా. ఇది నిజం. ముమ్మాటికి నిజం...' అంటూ తన నిజాయితీని శంకించటానికి వీల్లేకుండా, తొణక్కుండా గంభీరంగా అనేసింది శారద

కళ్ళు పెద్దవిచేసి, ఆమె మొహంలోకి ఓ క్షణంలో ఆలో చనగా చూశాడు

శారద భేషజాలకు యేమీ పోదు ఉన్నది ఉన్నట్లు అనేస్తుంది. నిజమే! తలవిదిలించేసుకున్నాడు. మరి యిందాక ఆఫీసులో ఆ సునీతకు వచ్చిన యేళ్ళకు, నన్ను తండ్రిలాంటి వాడంటుందేమిటి! ఆవిడ కళ్ళకు అట్లా కనిపించానేమో! క్రాపు యెత్తుగా వు దే అని నన్ను చూసి వ్యంగ్యంగా అంటాడేమిటి ఆ సీను ఆనందరావుగారు కూడా సాగించారు. చెంప వట్టీలు

క్రిందకు లాగటం అని కామెంటా! ఆ ముసలి వెధవ వాడికి నాకు పోలికేమిటి. ఇంకా నాలుగు యేళ్లల్లో మనోవర్తి తీసుకో బోతున్నాడు. ఇదంతా నన్ను చూసి అసూయ పడటం కాబోలు. అంతకంటె యేమనుకోవాలి తనలో తాను నవ్వుకున్నాడు. శారద అబద్ధమాడదు. ఇవ్వాళ. శారద నిజంగా ఉన్నది ఉన్నట్లుగానే చెప్పింది. శారద కంటికి ఆ విధంగా కనిపిస్తున్నానంటే నా ఊహ తప్పుకాదు.

తనలో తాను తర్కించుకుంటూ శారదను దగ్గరకు తీసుకో బోయాడు. కృతజ్ఞత తెలియ పరచటానికన్నట్లు.

'టీ ఒలికిపోతుంది....వుండండి....అయ్యో. నే కింద పడే ట్టున్నా....' ఉక్కిరి బిక్కిరయింది శారద.

'మహ పడితే నావళ్లో పడతావు అంతేగా....' మొహంలో మొహం పెట్టి, ఆనందరావు నవ్వుతుంటే, ఆయన మొహంలో ముడతలు శారదకు కొట్టొచ్చినట్టు కనిపించినాయి.

ఇంట్లో ఉత్సాహం రోజురోజుకు మితిమీరి పోతోంది. శారద భర్తను పూర్తిగా ఆకట్టేసింది. ఏ మాట మాట్లాడినా, ఏ పని చేసినా, శభాషని మెచ్చుకుంటున్నాడు. కాని బైట అడుగు పెట్టటానికి మాత్రం ఆనందరావుకు భయంగానే వుంటుంది. ఎవరు ఏ క్షణాన రఫీమని ఏ మాటంటారో అని హడలిపోతూ వుంటాడు. ఎవరితోనైనా కాసేపు డాట్లాడాలిసి వస్తే, పొడిపొడి ముక్కలు నాలుగు అనేసి 'వస్తా' అని గిర్రున తిరిగి వెళ్ళిపోతూ వుంటాడు. ఆఫీసుకు వెళ్ళేముందు, అద్దాన్ని పలకరించే టైము రోజురోజుకు యెక్కువయిపోతోంది. ఎంతసేపు చూసుకున్నా, ఏదో క్షణంలో ఒక్కసారి గతుక్కుమనటం తప్పటం లేదు.

ఆఫీసులో యెవరి నోరైనా కట్టెయ్యొచ్చు గాని, ఆ సుందరం నోటికి మాత్రం హద్దుండదు. ఎంత మాట పడితే అంత మాట అనేస్తాడు. అందులో మరీను టైపిస్టు సుందరరే!

'మీరు పెద్దవారు. ఏం చెప్పమంటారు. ఆ ఫైలు సరిగ్గ చూడకపోతే యెట్లా చెప్పండి. మీ ఎండార్స్‌మెంట్ మీదగదా నేను డిసిషన్ తీసుకునేది....' అంటాడు సుందరం.

'మీరు రాసింది తప్పు. ఒళ్లు దగ్గర పెట్టుకుని బాధ్యతగా వ్యవహరించాలి. ముందు ముందు వృద్ధిలోకి రావలసిన వారు, మీరే యిట్లా చేస్తే యెట్లాగు' అని ముక్క చివాట్లు పెడితే, నేను యెంతో సంతోషించే వాణ్ణి. వాడికి అదేం నాయురోగమొ 'మీరు పెద్ద వారు' అని మొదలు పెడతాడు అనుకుంటూ ఆనందరావు చిటచిటలాడి పోతున్నాడు.

ఆనందరావు గడియారం పెండులం లాగ ఊగిసలాడి పోతున్నాడు. అటూ, యిటూ, అటూ, యిటూ ఆయన మనస్సు నిలకడ లేకుండా పోయింది.

సూర్యుని లేత కిరణాలు, మెల్ల మెల్లగా గేటులోంచి పోర్టికోలోకి, దూసుకుని నాటిగ వంటింటి వైపు ప్రసారమవుతున్నాయి. పల్చటి డోర్ కర్టెన్ చిరుగాలికి రెపరెపలాడుతుంటే, ఆ సందుల్లోంచి వెలుతురు గోడ గడియారం మీదపడి తళతళ మంటోంది.

ఆనందరావు పడక కుర్చీలో పడుకుని, అట్టే ఆ వెలుతురును చూస్తున్నాడు టంగ్ టంగ్ మంటూ గోడ గడియారం ఎనిమిది గంటలు కొట్టింది. అప్పుడే యింత వైపు యింకా అనుకుంటూ,

బద్ధకంగా లేచి, వంటింటి వైపు నడిచాడు శారద, దొడ్లో తులసి చెట్టు దగ్గర, తల ఆరపోసుకుంటోంది. ఆనందరావు కళ్ళు కురచయినాయి ఆమెతల సూర్యరశ్మికి తెల్లతెల్లగా మెరుస్తోంది. అట్లాగే నిలబడిపోయాడు. జుట్టును కుడివైపు బుజం మీదకు పోనిచ్చి, తుండు గుడ్డతో, గట్టిగా తుడుచుకుంటుంటే, శారద మొహం సగంవరకే కనిపిస్తోంది ఆనందరావుకు. ఆశ్చర్యపోయాడు దవడలు అంటుకుపోయి, ఆమె మొహం గాంభీర్యంపుగా కని పించింది. ఆ చేతుల్లో కూడా నాజూకుతనం ఎక్కడా కనిపించటం లేదు. ఒక్కొక్కసారి తల విదిలిస్తున్నప్పుడు, క్షణంలో మొహం ఎదురుగా కనిపించి, ఆనందరావును భయపెట్టేస్తోంది.

శారద చాలా పెద్దదయి పోయిందేమిటి! తల కూడా నెర సింది ఇట్లా వుందేమిటి అనుకుంటున్నాడు.

'ఏమిటి పరీక్ష చేస్తున్నారు!... తల తుడుచుకుంటూనే, భర్తవైపు తిరక్కుండానే అన్నది శారద.

'అబ్బే ఏముంది, ఏంలేదు 'అన్నట్లుగా తల అడ్డంగా మెల్లిగా రెండు మూడు సార్లు కదిలించాడు ఆలోచనగా

అనాటినుంచీ కూడా శారదను చూస్తున్నడప్పుల్లా, ఆనంద రావు మనస్సు చివుక్కు మంటూ వుంటుంది రోజు రోజుకు ఆమె ఆకృతిలో ఆకర్షణ తగ్గి పోతున్నట్లు ఆయింట్లో యెవత్తో ఓ పెద్ద యిల్లాలు సంచరిస్తున్నట్లు అతనికి అనిపిస్తోంది.

భర్తలో కలుగుతున్న మార్పును శారద గ్రహించినప్పటికి, ఫలానా అని తెలుసు కోలేక పోతొంది విడ్డూరంగా తన వైపే చూడటం ఒక్కొక్కప్పుడు ఆశ్చర్యంగా, తనను చూస్తూ నిలబడి పోవటం గమనిస్తూ, శారద మధన పడుతోంది

ఆనందరావు మాత్రం రోజూ గంటా రెండు గంటలు మేకప్ చేసుకోవటం మరచి పోవటం లేదు ఉత్సాహంగా గంతు లేస్తున్నట్లు, యింట్లో మాట్లాడుతూ వుంటాడు. అతని మనస్సులో యింకా యింకా కోర్కెలు చెలరేగుతున్నట్లు అతని మాటల ధోరణిలో శారద తెలుసుకుంది. కాని ఆమె భర్తకు యే ఆంక్షలు విధించలేని పరిస్థితిలోనే వుండి పోయింది

ఊరంతా గాలించి, గిర్రున యింటికి వచ్చేటప్పటికి, శారదను చూడగానే, మూర్ఛ వచ్చినంత పనవుతుంది, ఆనంద రావుకు.

ఉల్లాసంగా ఊగిస లాడుతూ, శారదకు ఎదురుగా కూర్చుని, చిరునవ్వుతో పలకరించాడు అరచేతులు రెంటిని, గుండ్రంగా, పైపైన రాసుకుంటూ, కళ్ళు రెండూ పెద్దవి చేసుకుని 'శారదా' అన్నాడు తాపీగా.

ఏమిటన్నట్లు కను బొమ్మలు పైకి క్రిందకు కదిలించింది.

"ఏం లేదు. నువ్వు ముసలి దానవయి పోతున్నావు.... ఊహు... నా ఉద్దేశం, నీలో ముసలి కళ బాగా వచ్చేసింది...." నాలుక కరుచుకున్నాడు.

'అవును నిజమే. రేపు శ్రావణ మాసానికి, నాకు నలభై అయిదేళ్ళు వెళతాయి. చిన్నదాన్నా నేను మరి...." అంటూ శారద చెప్పబోతుంటే, చటాలున లేచి, చెవులు రెంటిని రెండు చేతుల్తోనూ గట్టిగా మూసుకుని, 'యిహ చాల్లే ఆపు, అంటూ గట్టిగా అరిచాడు ఆనందరావు.

---